# అర్రుకడిగిన ఎద్దు

నేను ఇప్పుడీ కొట్టంలో వాలమాలల పడివున్నాను. నేను ఇక్కడ ఈసురోమని పడివున్నాననే సంగతి ఎవ్వరూ గమనించరు. నా చుట్టూ వున్న ఈ రొచ్చూ, నా శరీరం మీద వున్న ఈ గోమార్లూ చూశారా? అంతే. నా చుట్టూ కొంచం బాగుచెయ్యాలని గానీ, చచ్చేదాకా నా వొళ్ళు వీలున్నప్పుడల్లా శుభ్రపరచి నా చావు సుఖవంతం చెయ్యాలనిగానీ ఎవ్వరికీ తట్టదు. పైగా చావకుండా ఇంకా ఇక్కడే వున్నానని నా యజమాని మొదలు ఇంటిల్లపాదీ విసుక్కుంటూ వుంటారు. నాకూ త్వరగా చచ్చిపోవాలనివుంది. ఏం చెయ్యను? నాకు చావురాకుండా వుంది. తన్ను గురించి ఈ మాటే అంటూ వుంటాడు. బక్కచిక్కి వొక కుక్కి మంచంలో కూర్చునివుండే నా యజమాని తండ్రికూడా! ఆ సంగతి తరువాత చెపుతాను.

మెడలలోని గంటలను గణగణ మోగించుకుంటూ, ఠీవిగా మేతమేస్తున్న ఆ ఎద్దులను చూశారా? మా యజమానికి ఆ ఎద్దులంటే అమిత ప్రేమ. వాటికి జనపకట్టలూ, పచ్చగడ్డీ, ఉలవలూ అన్నీ పెడతాడు. పడుకున్నప్పుడు వాటి వంటికి ఎక్కడ గలీజు అంటుకుంటుందో నని ముప్పూటలా శుభ్రం చేస్తాడు, తన సొంత చేతులతో వాటి వొంటిని రోజూ మాలిస్ చేసి నిగనిగలాడేటట్లు వుంచుతాడు. ఊళ్ళో అందరికీ వాటినిచూపి గర్వపడతాడు.

కాని ఈ మూలపడివున్న నా సంగతిమాత్రం ఆలోచించడు. నా ముందు గడ్డి వున్నదీ లేనిదీ చూడడు. ఆ ఎద్దులు తినలేక మిగిల్చి తొక్కివేసిన చెత్త, తీసి పెంటపోగులో వేసేటప్పుడు నా ముందు నాలుగు పరకలు రాలుస్తాడు. వయస్సువాళ్ళి కాటికి కాలుచాచుకొని వున్న నేను, లేవలేక పడుకొని వుంటే, ఆ పరకలు తినగలందులకు లేవమని వొక తన్నుతన్ని వెళ్తావుంటాడు. నా అంత నన్ను లేవనిస్తే ఆయనకు పోయిందేమిటో!

అయితే నా యజమాని నన్నెప్పుడూ ఇలాగే చూసేవాడా అంటే కాదు. ఆ ఎద్దులను చూచినట్లు నన్నూ అప్యారబతంగా చూచిన రోజులు వున్నాయి. అప్పుడు నేను వయస్సులో వున్న రోజులు. నా యజమానికోసం రాత్రింబగళ్లు కష్టపడి పనిచెయ్యగలిగిన స్థితిలో వున్న రోజులు. ఆ రోజుల్లో తన బిడ్డలకంటే మమ్మలను జాగ్రత్తగా చూచుకొనేవాడు మా యజమాని. నన్నూ నా జత ఎద్దునూ కొన్నప్పుడు ఆయన పది ఎకరాల రైతు. మా అరుసులు కడిగేనాటికి ఆయన ఇరవై ఎకరాల రైతు. ఈ పది ఎకరాలూ ఆయన మావల్లే కొనగలిగాడని నేను చెప్పుకుంటే మాత్రం ఈనాడు నా మాట నమ్మేది ఎవ్వరు?

నేనూ నా జత ఎద్దూ నా యజమాని దొడ్లో పుట్టినవాళ్ళంకాదు. మామీద మోజుపడి, ఎక్కువ డబ్బుపెట్టి ఇంకొక గ్రామంనుంచి కొనుకొని వచ్చాడు. ఆ రోజు నా కొగా, కండ్లకు కట్టినట్లు జ్ఞాపకం వుంది. మమ్మలను చూచుకొని ఆయన ఎంత గర్వపడ్డాడనుకున్నారు! ఏదో శాస్త్రం

చెపుతారే, ముడ్డిమీద గుడ్డ నిలవలేదని—అట్లా వున్నాడు.

మా ముఖాలకు పసుపురాసి, కుంకుమ పెట్టి మా కొమ్ములు అలంకరించి వూరంతా వూరేగించాడు. వూళ్ళో వాళ్ళందరికీ భోజనాలు పెట్టాడు. వూరందరికీ ఆరోజు పండుగే. ఇంటికి వెళ్ళగానే మా యజమాని భార్య మాకు దిష్టితీసి దొడ్లోకి తీసుకువెళ్ళింది. మాకు జరిగిన వైభవం, మేమే నమ్మలేనంత విపరీతంగా జరిగింది.

ఆ సాయంకాలం వూళ్లోవాళ్ళంతా నా యజమాని దగ్గరకు వచ్చి, మా బలాన్ని పరీక్షించటానికిగాను, నాలుక పుట్టెడు వడ్లబస్తాలను బండిమీద వేసి, ఆ బండిని చెరువులో ఇటునుంచి అటు లాగించాలన్నారు. మా యజమాని, మాకుమల్లేనే అప్పుడు వయస్సులో వున్నాడు. మా శక్తి సామర్థ్యాలలో అయనకు మంచి నమ్మకం వుంది. ఆయన తండ్రి 'ఎందుకు నాటిని కష్టపెట్టటం. పుట్టెడు వడ్లు ఆ ఊబిలో ఎంత మంచి గొడ్లయితే మాత్రం ఎట్లా లాగుతై?' అని నాలుక ప్రక్కన చెపుతున్నా వినకుండా అంగీకరించాడు.

ఆ సాయంకాలం వూళ్ళో జనం అంతా చెరువుగట్లమీదకు జేరుకున్నారు. స్త్రీలూ, పురుషులూ, పిల్లలూ వూరు వూరంతా అక్కడే వున్నారు. వారిని చూస్తే మాకు అమితోత్సాహం కలిగింది. ఆ ఉత్సాహంతో జయజయధ్వానాల మధ్య తేలిగ్గా బస్తాల బండిని ఇటునుంచి అటు లాగివేశాం.

నాజత ఎద్దు అంతకుముందు రెండు సంవత్సరాల క్రిందట కాడికి కలిపిన గిత్త. దానికి బలం పౌరుషం వున్నాయి. గాని నొడుపులు తెలియవు. అందుకని చెరువుమధ్యకు

వెళ్లింతరువాత, బండిని లాగలేక నిలబడింది. నా యజమాని ముఖం వివర్ణమయింది. తోక మెలిపెట్టి కొరడాతో చెళ్ళున దెబ్బ వేశాడు. కాని అది కదలలేదు. మొండికెత్తింది. జనం హేళనగా కేకలు వేశారు. నా యజమానికి వెర్రిగంగిర్లెత్తినై. దెబ్బమీద దెబ్బ దెబ్బమీద దెబ్బ వేశాడు. అది కదల్లేదు. ఇక రెండు నిముషాలు దాటితే అది పడుకుంటుందని నాకు అనుమానం వేసింది. ఎంత అనుమానం! బండికాడి మెడమీద వుండగా పడుకోవటం కంటే మా జీవితాలలో పెద్ద అనుమానం వేరే వొకటి వుండదు. నా యజమాని ఇక వూళ్లో తలెత్తుకు తిరగలేడు. "వలాని ఆయన అంతడబ్బు పోసి వడక మోతు ఎద్దుని కొనుక్కు-వచ్చాడ"ని గ్రామస్థులు ఆయన్ని జన్మాంతం గేలి చేస్తారు. రైతుకు ఇది భరింపరాని అవమానం. నా యజమానికి అవమానం జరిగితే వొకటీ? నాకు జరిగితే వొకటీనా? నేను పట్టుపట్టి, వొంట్లోవున్న సత్తువునంతా బిగబట్టి బండితో పాటు నా జత ఎద్దునుకూడా కలుపుకొని, వొక్క-వూపులో చెరువు అవతలి గట్టుమీదకు లాగివేశాను.

మొత్తానికి ఎట్టాగయితేం మా యజమాని గౌరవం నిలబెట్టాం. గ్రామస్థుల మన్ననలు పొందాం. కాని ఆ పట్టులో నా జత ఎద్దుగుండె దెబ్బతిన్నది. అది పైకి కనపడే దెబ్బకాదు. లోలోపలే గుండె బలహీనపడి పోయింది. అందుకని పెద్దపెద్ద బరువులు వేసినప్పుడల్లా, దానిమీద ఎక్కువ బరువు పడకుండా నేనే ఒడుపుగా లాగుతూ వుండేదాన్ని. ఎవ్వరు

ఎవ్వరి బరువును లాగితే ఏం? మేము మా ధర్మాన్ని సక్ర మంగా నెరవేర్చుకున్నాం.

మా మూలుగా మోట లాగటం దానంతట అదే కష్టమైనపని. గుండెలుపడ త్తె. మా యజమానికి వొక చిన్న తోట వుండేది. దానికి నీళ్లు పెట్టటానికి మేమే మోట లాగే వాళ్ళం. మేమే బండి ఈడ్చేవాళ్ళం, పొలం దున్నేవాళ్ళం, మోట లాగేవాళ్ళం. సహజంగా రైతులకు మోట లాగ టానికి వేరే ఎడ్లజత వుంటుంది. పొలం దున్నే ఎడ్లు మోట లాగటానికీ, మోట దున్నేఎడ్లు పొలం దున్నటానికీ పనికి రావు. మేముమాత్రం అన్నిపనులూ చేసేవాళ్ళం. ఆ పను లన్నీ చేసినందుకు నేను విచారపడటంలేదు. మేము పుట్టిందే రైతులకు సహాయపడటానికి. కాని యజమానులు మా సం గతికూడా ఆలోచించాలిగదా! వారికి సహాయపడటంకాక, మాకు వ్యక్తిగత జీవితాలు అనేవి వొకటి వుంటాయిగదా! అవి సవ్యంగా జరిగిపోయే బాధ్యత యజమానులు భరించక పోతే మా గతేంకాను?

నా జత ఎద్దు ఆ గుండె జబ్బుతోనే చచ్చిపోయింది. అప్పుడు నాకు చాలా విచారం కలిగింది. కాని ఇప్పుడు అదే అదృష్టవంతురాలు అనుకుంటున్నాను. తరువాత నా జతకు నా యజమాని మరొక ఎద్దును తెచ్చాడు. కొన్నాళ్ళు దానితోకూడా కలిసి పనిచేశాను నేను.

నేనిప్పుడు ముసలిదాన్నయ్యాను. కాలుతీసి కాలు వెయ్యలేను. లేచి నిలబడటమే కష్టంగావుంది. ఆకలి అనేది వుంటుంది. అది శరీరం వున్నంతకాలం వుంటుందికాబోలు.

కాని పండ్లు కదిలి పోవటంవల్ల ఆకలి తీర్చుకోవటానికి కావలసిన ఆహారం తినలేకుండా వున్నాను ఎండుగడ్డి నమలలేను. దండుగ అని పచ్చగడ్డి నా యజమాని నాకు వెయ్యడు. అప్పుడప్పుడూ మిగిలిన ఎద్దులు తినక విడిచిపెట్టిన జనుప మోళ్ళు నా యజమాని నాకు వేస్తూవుంటాడు. జనుము మీద వున్న ఆశకొద్దీ తిందామని ప్రయత్నిస్తాను. కాని ఆ మోళ్ళు కొరకటం నా వశమా? నా వశంకాక పైపైన చప్పరించి విడిచిపెడతాను. అందుకు నా యజమానికి కోపం, తినలేక విడిచిపెట్టానని ఆయన కేం తెలుసు పాపం? మోళ్లుగనక తినలేదని చేతులోవున్న ముల్లుకర్రతో 'నీ కింత కావరమా?' అని ఎడా పెడా కొడతాడు. విన్నారా? కాటికి కాళ్లు చూచుకొని కూర్చున్న నాకు కావరమట! అంటే అన్నాడు. ఆయన అనటానికీ మేము పడటానికీ పుట్టాం. కాని ఈ వయస్సులో దెబ్బలు భరించటం కొంచం కష్టంగా వుంటుంది. నా జత ఎద్దుతోనే పోక ముసలితనం వచ్చిందాకా బ్రతికినందుకు నన్ను నేను తిట్టుకోవటంకంటే చేసేది ఏముంది?

నేను ముసలిదాన్నయ్యాను. నిజమే. నేను పనిచెయ్యలేను. నిజమే. నాకు ఎంతతక్కువ మేత వేసినా అది నా యజమానికి నష్టమే. నిజమే. కాని ఇంతకుముందు నే చేసిన పనికీ, నా యజమానికి సంపాదించిపెట్టిన లాభానికీ నాకు సహజ మరణం వచ్చేవరకూ బ్రతికే అర్హత లేదా? నేను చేసిన సేవకు నా పట్ల కాస్త ఆదరం చూపవగూడదా? ఇవ్వాళో రేపో నేను ఎల్లాగూ కన్నుమూస్తాను. ఈ నాలుగు రోజులూ, రోజుకు

పోగూడదా? అందుకు నేను నోచుకోలేదు. అది ఆశించటం కూడా తప్పే. ఎందుకంటే నాదేముంది? నా యజమాని తండ్రికూడా నా స్థితిలోనే వున్నాడంటే ఇక చెప్పవలసిందేముంది?

నా యజమాని తండ్రి చాలా మంచివాడు. అంటే పాతకాలం మనిషి. నేను ఈ యింటికి వచ్చేముందు ఆయన తాళపుచెవులు కొడుకుకి అప్పగించాడు. అప్పటినుంచీ ఏ విషయంలోనూ జోక్యం కలిగించుకునేవాడుకాదు. నా అగ్రు కడిగి నన్నీ మూలకు జేర్చింతరువాత, ఆయన అప్పుడప్పుడూ వొచ్చి నా దగ్గర కాసేపు కూర్చొని వెళ్ళేవాడు. నా మనస్సులోవున్న కష్టం ఆయనకు తెలిసినట్లుగా ఎవ్వరికీ తెలియదు. ఎందుకంటే ప్రస్తుతం ఆయన అనుభవంకూడా ఇంచుమించు నా అనుభవానికి మల్లేనేవుంది. మేము ఎందుకు బ్రతుకుతున్నామో యితరులకు తెలియదు. మాకు తెలియదు.

ఆయనకు భార్య గతించి చాలారోజులైంది. ఆయనకు వున్నది వొక్క కొడుకూ కోడలూ; వాళ్ళకు నలుగురు ఆడపిల్లలూ, వొక మొగపిల్లవాడూ. కొడుకు ఆయనసంగతి పట్టించుకోడు. కోడలుకి ఆయనంటే పడదు. ఆమెకు ఆయన వొక తగలాటంగా కనపడుతుంటాడు. వేళకు అన్నం పెట్టదు. అందరికీపెట్టి తాను తిని అప్పు డాయన్ను పిలుస్తుంది. ఏది మిగిలితే అది వేసిపెడుతుంది. ఏది వేస్తే అదితిని ఆయన చెయ్యి

కడుక్కుంటాడు. కుక్కిమంచంలో మునగదీసుకొని కూర్చుంటాడు. ఆయన సంగతే అట్లావుంటే ఇక నాదేముంది?

ఆయనకూ నాకూ అమితస్నేహం. ఎవ్వరూ లేకుండా చూచి నాదగ్గరకు వచ్చి కూర్చునేవాడు. ఆయన నేనూ కలిసి వుంటే నా యజమానికి తగని కోపంవచ్చేది. తనకోసం కష్టించి, యెముకలను అరిగించుకొని పనిచేసిన మా యిద్దరినీ తాను చూడవలసినవిధంగా చూడటంలేదని జ్ఞాపకం వచ్చేదో ఏమో! "నీ కిక్కడ ఏంపని?" అని తండ్రిని గదమాయించేవాడు. ఆయన నెమ్మదిగా లేచి కర్ర పోటు వేసుకుంటూ ఇంట్లోకి వెళ్ళేవాడు. నేను కండ్లప్పగించి చూస్తూ వుండేదాన్ని.

ఎవ్వరూ లేనప్పుడు ఆయన్ని చూచి నేనూ నన్ను చూచి ఆయనా కన్నీరు పెట్టుకుంటూ వుండేవాళ్ళం. అంతకంటే మాట్లాడుకోవలసింది ఏముంటుంది మాకు? నేను మెడ చాచి, ఆయన భుజంమీద పెట్టేదాన్ని. ఆయన కాసేపు నిమిరేవాడు. మేమిద్దరం చావటం చేతగాక బ్రతుకుతున్న వాళ్ళం. మామాట ఎవ్వరు పట్టించుకుంటారు? మేము అందరికీ భారమే. మమ్మల్ని ఎందుకు తీసుకుపోడో భగవంతుడు? తీసుకుపోతాడు. కాని ఎంత త్వరగా తీసుకుపోతే అంత మంచిది.

ముసలాయన వారం రోజులనుంచీ నాకు కనబడటం లేదు. మంచం పట్టాడని ఎవ్వరో అనగా విన్నాను. ఆయన కనపడకపోవటంవల్ల నాకు మరీ దిగులుగా వుంది. ఇక ఆయన కూడా కనపడడు కాబోలు!

ఇది ఇలావుండగా ముసలి పశువుల్నీ, పనికి ఉపయోగించని పశువుల్నీ కొనటానికి వూళ్లోకి ఎవరో వచ్చారని విన్నాను. వారు పశువులను అయినకాడికికొని, మాంసం కోసం కసాయి కొట్టుకు తోలుతారట. రైతులకు ఈ విషయం తెలిసివుండే తెలియనట్లు నటించి అమ్మివేస్తారట. ఎంత అన్యాయం!

ఆ పరిస్థితే వస్తే నా పీడ ఏదోవొక విధంగా వొదిలించుకోటానికి నా యజమాని వెనుదియ్యడనే నా అనుమానం. మా జాతిపట్ల రైతులు ఇదివరకు ఇంత నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించేవారు కాదు. అహోరాత్రుళ్లూ తమకోసం పనిచేసి వృద్ధాప్యంలో అడుగుపెట్టిన మా జాతిని ఎంతో గౌరవంగా చూసేవారు. మా గతం తెలియని పిల్లలు మమ్మలను ఆటలు పెట్టించటానికి ప్రయత్నిస్తే, "దాని సంగతి మీకేం తెలుసోయ్? దాని రోజుల్లో..." అని మేము చేసిన ఘనకార్యాలన్నీ చెప్పి, మమ్మలను పొగిడి మాపట్ల వారికి సానుభూతి కలిగేటట్లు చేసేవారు. "అది మన యింట్లో అడుగుపెట్టిం తరువాతే మనకు కలిసివొచ్చిందమ్మా. దాన్నేమీ అనకండి. అంటే దేవుడు మెచ్చడు" అనేది ఇలాలు.

ఆ రోజులు గతించినై. ఉపయోగపడినన్నాళ్లూ ఉపయోగించుకొని, తరువాత కాటికి కాలు పట్టుకొని ఈడ్చే రోజులు ఇవి. కొడుకు కన్నతండ్రినీ తల్లినే ఈపని చేస్తున్నాడు. ఇక మాదేముంది నోరులేని జీవాలం?

నాకిప్పుడే కోరికాలేదు. వొక్కసారి ముసలాయన భుజంమీద తల ఆన్చి కన్నీరు పెట్టుకునే అవకాశం వుంటే

చాలు. ఆయన వొక్కసారి తన చల్లని వ్రేళ్ళతో నా మెడ నిమిరితే చాలు. ఆయనకంటే ముందు నేను దాటిపోతేచాలు.

అదిగో ఆ కాకిని చూశారా, ఎట్లా కుప్పిగంతులు వేసుకుంటూ వస్తూవుందో! నా వెన్నుమీద వున్న పుండును తడవ తడవకూ వచ్చి పొడుస్తూ వుంటుంది. దానిని నేను ఎట్లా ఆపగలను? తోకకూడా లేపలేనే!

ఆ పుండుకు ఏదన్నా మందు రాయించకపోతే పోయాడు నా యజమాని. చినిగిన ఏ పాత గోనెగుడ్డతోనో కాస్త కప్పించగూడదా! కప్పించడు. ఆ గోనెగుడ్డని పాడు చెయ్యటం మాత్రం ఎందుకు? అనుకుంటాడు కాబోలు.

అదిగో వస్తూవుంది కాకి.

అబ్బా!......